# రూపాయి బిళ్ల అంచు

చంద్రుడు సత్తు రూపాయిలా ఉన్నాడు.

ప్రభుత్వాసుపత్రి అందరూ ఉన్న అనాథలా దిగులుగా ఉంది.

పురుళ్ళ వార్డు పళ్ళ బిగువున పెద్ద బరువు భరిస్తోన్నదానిలా ఉంది.

ఉండి ఉండి పీలగా ఏడుస్తున్న పిల్లలూ, కలవరిస్తోన్న తల్లులూ అరమోడ్పు కన్నులతో నిద్రపోతూ మధ్య మధ్య ఆవులిస్తోన్న ఆ వార్డు నర్సూ అప్పుడప్పుడూ కొంచెం ఆటంక పరుస్తున్నా మొత్తానికి ఆ వార్డుని నిశ్శబ్దం నీరసంగానే అయినా పాలిస్తోంది.

ఉన్న కొద్ది మంచాలనీ క్రొత్తగా పురుడు పోసుకున్న వారికి కేటాయించడం వల్ల అయిదు రోజుల క్రితమే తల్లి అయిన ఆదెమ్మ మరి కొందరితోబాటు చాపల మీదే పడుకుంది. ఎన్నడూ పట్టు పరుపుల మీద దొర్లినామె కాకపోవడంతో చాప ఆమెకి ఇబ్బంది కల్గించడం లేదు. అలా అని ఆమె హాయిగా నిద్రపోవడమూ లేదు.

మరి?

మౌనంగా భూదేవిలా కన్నీరు కారుస్తోంది. విలపిస్తోంది!

ఆవేళ ఉదయం వచ్చి వెళ్ళిన తన భర్త అన్న మాటలు ఆమె చెవుల్లో అరిగిపోయిన రికార్డుల్లా గోలచేస్తూ గుండెను తూట్లు పొడుస్తూ మెదడుపై సమ్మెటపోట్లు పొడుస్తున్నాయి.

నిండా పద్దెనిమిదేళ్ళు కూడా లేని ఆదెమ్మ-నాలుగు రోజుల క్రితమే పండంటి కొడుక్కి జన్మనిచ్చింది.

కన్నీటితో ముక్కు తుడుపుల్తో పైటకొంగు తడిసిపోయింది.

ఆమెకి పేరు తెలీని లోకాల్లో ఉన్న తండ్రి గుర్తొస్తున్నాడు. దు:ఖం రెట్టింపవుతోంది.

తండ్రే బ్రతికి ఉంటే తనీ రోజున ఆనందంతో ఉప్పొంగాల్సిన ఈ సమయంలో ఇలా కుళ్ళి కుళ్ళి ఏడ్వాల్సి వచ్చేదా అని ప్రశ్నించుకుంటూ సమాధానం కోసం పిచ్చిదానిలా వెదుక్కుంటోందామె.

ఆదెమ్మ తండ్రి తాపీ మేస్త్రిగా పని చేసేవాడు. అతడి చేతిక్రింద ముగ్గురో నలుగురో పనివాళ్ళుండేవారు. అతడికి వాస్తు శాస్త్రం గురించి బాగా తెలుసనీ, హస్తవాసి మంచిదనీ నమ్మకస్తుడనీ పేరుండటం వల్ల చేతినిండా పని ఉండేది. ఇంట్లో చిల్లరే అయినా నాట్యం చేస్తూండేది. ఆ వేడిలో తన తాహతుకి మించి ఖర్చు చేసి ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేశాడు.

మూడోది ఆదెమ్మ. ఆమెకు పెళ్ళీడు వచ్చేసరికి చూపుతోబాటు పని కూడా మందగించింది. అయినా పదిహేనొందలు కట్నం ఇవ్వడానికి ఒప్పుకుని కూతురి పెళ్ళి కుదిర్చాడు. క్రిందా మీదా పడి డబ్బు సమకూర్చాడు. అంతలో మృత్యువు ఆయనను మ్రింగేసింది. ఒక్క పదిహేను రోజుల్లో పెళ్ళి బాజాలు మ్రోగాల్సిన ఇంట్లో చావు ఏడ్పులు ప్రతిధ్వనించాయి.

అన్ని ఏర్పాట్లూ అయ్యాయి గనుక, దు:ఖాన్ని దిగమ్రింగుకుని అనుకున్న ప్రకారం కళ్యాణం జరిపించెయ్యటం మంచిదని సలహా ఇచ్చారు అయినవాళ్ళు ఆదెమ్మ అన్నకి.

అతడో ప్రక్క తలూపుతూనే అసలు సంగతి బయట పెట్టాడు. కట్నం సొమ్ములోంచి అయిదొందలు దిన వారాల క్రింద ఖర్చు పెట్టేశాననీ ఇప్పట్లో తనంత డబ్బు సమకూర్చలేననీ చెప్పేడు.

తండ్రిపోయి ఏడుస్తున్న వాడిని ఏడ్పించడం మర్యాద కాదనీ కాలూ చెయ్యీ కూడదీసుకోగానే ఇచ్చేస్తాడనీ ఆదెమ్మ అత్తవారికి నచ్చజెప్పి ఆ శుభకార్యం కాస్తా జరిపించేశారు.

కోటీ కలలతో తీయని తలపులతో, వలపులతో అత్తింట అడుగుపెట్టిన ఆదెమ్మకి అన్ని వైపులనుంచీ-ముఖ్యంగా అత్తగారి దగ్గర్నుంచి-నిరసనలూ, దెప్పుళ్ళూ. సాధింపులూ ఎదురయ్యాయ్.

అలా అని కోడలంటే ఆమెకి ప్రేమలేదని కాదు. ఉంది కాని డబ్బు దానిమీద నల్లగుడ్డ కప్పేసింది.

తన ఒక్కగానొక్క కొడుకు పెళ్ళికి రాబోయే కట్నం గురించి ఆమె చాలా ఆశలు పెట్టుకుంది. పదిహేను వందల రూపాయలు కట్నంగా ఇస్తానని ఆదెమ్మ తండ్రి ముందు కొచ్చినప్పుడామె ఎంత పొంగిపోయిందో ఎందరు దేవుళ్ళకి దణ్ణాలు పెట్టిందో లెక్కేలేదు. అడిగినమ్మనీ అడగనమ్మనీ కూడా పిలిచి మరీ చెప్పింది.

ఆమె వెర్రి ఆనందానిక్కారణం లేకపోలేదు.

ఆమె భర్త ఎందుకు చేశాడో కూడా గుర్తు లేదు......ఎప్పుడో వందో రెండువందలో అప్పుచేశాడు-ఊరి మోతుబరి సుబ్బారాయుడి దగ్గర. అప్పుడప్పుడూ కొద్దో గొప్పో చెల్లు వేసినా పదేళ్ళ క్రితం అతడు పోయేనాటికి అప్పు వెయ్యి రూకలై కూర్చుంది.

దాంతో తన కొడుకుని సుబ్బారాయుడు గారి చిన్న పాలేరుగా చెయ్యక తప్పలేదు. అతడు పెద్దైనా వూళ్ళోవాళ్ళు అతడి ఈడువాళ్ళకి ఏడాదికి ఇరవై బస్తాల ధాన్యం ఇస్తున్నా ఆయన వాడికి పది బస్తాలే ఇస్తానంటే పెదవి కదపలేక పోయింది.

ఆయనంతటితో ఊరుకోక ప్రతి ఏడాదీ వెయ్యిరూపాయల మీది వడ్డీని మాత్రం గుంజుతున్నాడు. దానితో రెక్కలు ముక్కల చేసుకుంటున్నా తల్లీ కొడుకుల బతుకులు ముక్కలు చెక్కలుగానే ఉండిపోయాయి. అప్పు మాత్రం గుమ్మటంలా అలాగే కూర్చుండి పోయింది.

పాలేరుతనం చేస్తూ అప్పు తీర్చటం కలలో తప్ప జరగదని గ్రహించక తప్పింది కాదామెకి.

పెళ్ళి సంబంధాలు రాసాగాయి. అతగాడికి వచ్చే కట్నంతో అప్పు తీర్చేసి ఆనక సుబ్బారాయుడుగారి కమతంలోంచి వచ్చేసి మరొకరి దగ్గర ఇరవై బస్తాలకి కుదిరితే కొడుకు బ్రతుకు హాయిగా ఉంటుందని ఆశించింది. అందుకే కొడుకు పెళ్ళి ఆదెమ్మతో నిశ్చయమైనప్పుడెంతో సంబరపడింది.

కాని ఆదెమ్మ తండ్రి మరణంతో సంబంధం కాస్తా అంబరం ఎక్కింది. మధ్యవర్తుల మాటల్ని కాదనలేక కూతుర్లాటి స్త్రీకి అన్యాయం చెయ్యడం ఇష్టంలేక అయిష్టంగానే పెళ్ళికి ఒప్పుకుంది. వాళ్ళిచ్చిన వెయ్యిలో సగం ఖర్చులకి పోగా మిగిలింది అప్పులో జమకట్టింది. ఆ కొసరు కూడా ఇచ్చేస్తే అప్పు బాధ పోనుకదా అనుకుంటూ ఇస్తారిస్తారని చూసి చూసి నిరాశపడింది. నిరాశ నిస్పృహయై కోడలి పాలిట దు:ఖహేతువై కూర్చుంది.

తొమ్మిదో నెల వచ్చాక పురుటికి ఆదెమ్మని తీసుకెళ్ళడానికొచ్చిన ఆమె అన్నగార్ని గుమ్మంలోనే నిలదీసి అడిగింది అత్తగారు-"పెళ్లయి ఏడాదిన్నర అవుతోంది. ఇప్పుడైనా కట్నం తెచ్చావా నాయనా?" అని.

నీళ్ళు నమిలాడతడు.

మూతి ముప్పై మూడు వంకర్లు తిప్పుకుందావిడ. "ఆ కొరవ ఏమైనా ఇచ్చేదుందా లేదా?"

"కొంచెం ఇబ్బందిగా ఉందండీ....."

"అన్ని ఇబ్బందులున్నవాళ్ళు గంతకు తగ్గ బొంతని వెతుక్కోక, తగదునమ్మా అని అంత కట్నం ఇస్తాననడం ఎందుకూ? ఇలా మోసం చెయ్యటం ఎందుకూ? ఇలా అయితే కుదరదబ్బాయ్! ఎలాగూ కడుపుతో ఉన్న చెల్లెల్ని తీసుకెళ్ళడానికొచ్చావుగా తీసుకెళ్ళు. కట్నం కొరవ ఇచ్చాకే మళ్ళీ నీ చెల్లెల్ని తీసుకురా" అందామె.

ప్రాన్పడి పోయాడతడు. ఏదో కోపంతో అంటోంది కాబోలు అనుకుని తలూపాడు.

కాని, చెల్లెల్ని తీసుకుని గడప దాటుతోంటే ఆవిడ మళ్ళీ హెచ్చరించింది- "అయిదొందలూ ఇస్తేనే మళ్ళీ నీ చెల్లెల్ని గడప తొక్కనిస్తాను. ఆనక నేను గయ్యాళినన్నా లాభం ఉండదబ్బాయ్! సీత కష్టాలు సీతవీ, పీత కష్టాలు పీతవీ అన్నారు. సుబ్బారాయుడి గారి అప్పు తీర్చకపోతే మేం రెండు పూటలూ ఇన్ని మెతుకులు తినలేం. మాకూ సుఖం ఉండదు. నీ చెల్లెలికీ ఉండదు. దానికి పుట్టినోళ్ళకీ ఉండదు. అంచేత నీ తల తాకట్టు పెట్టి అయినా తెచ్చిచ్చేయ్, అబ్బాయ్!"

కళ్ళల్లో నీళ్ళూ, నోట్లో పైటకొంగూ కుక్కుకున్న చెల్లెల్ని చూసేసరికి అతడి గుండె తరుక్కుపోయింది. కళ్ళు నీళ్ళతో తడిసి ముద్దవుతోంటే-"అలాగే అత్తయ్యా! వెళ్ళొస్తాం, అత్తయ్యా! వస్తాం, బావా!" అని చెప్పి చెల్లెల్ని ఎడ్ల బండి ఎక్కించి, తనూ ఎక్కాడు.

బండి భారంగా నడుస్తోంది.

మౌనంగా కూర్చుని ఎటో చూస్తున్నారు అన్నా చెల్లెళ్ళు.

అత్తింటివారు కట్నం బాపతు సొమ్ముకోసం చెల్లెల్నెంత హింసిస్తున్నారో, కట్నం ఇవ్వకపోతే రేపు జరిగే భాగోతం ఏమిటో తెలిసిపోయింతడికి. ఎలాగో డబ్బిచ్చేసి చెల్లెలి కన్నీళ్ళు తుడవాలనెంతో ఇదిగా ఉంది కాని, తన బ్రతుకూ అంతంత మాత్రంగానే ఉంది.

తండ్రి పోయేటప్పటికి తనకి తాపీ పనైతే వచ్చుగాని వాస్తు గురించీ ఇతర అంచనాలగురించీ తెలీదు. తండ్రి చేతిక్రింది పనివాళ్ళు స్వతంత్రంగా మేస్త్రీలైతే తను వారిలో ఒకరి దగ్గర పనివాడయ్యాడు. తన చేతుల మీదుగా ఎన్నో ఇళ్ళకి పునాది వేశాడు.

గోడలు కట్టాడు. కప్పు వేశాడు. కాని, కూలిపోయిన తనింటి గోడని మాత్రం కట్టుకో లేకుండా ఉన్నాడు!

అసలందుకే ఆదెమ్మ అత్తవారు ఆమెని తీసుకెళ్ళమని ఆరో నెల వచ్చినప్పట్నుంచీ కబురు పెట్టినా, తొమ్మిదో నెల వచ్చే వరకూ వంకలు పెడుతూ వచ్చాడు. కష్టానికీ కూడుకీ లంగరందక తను ఇదవుతోంటే మరో మనిషి బరువు భరించగలగడం అసాధ్య మనుకోవడమే దానిక్కారణం.

ఇప్పుడిహ తీసుకెళ్ళి పురుడు పొయ్యక తప్పదని తీసుకెళ్తున్నాడు తప్ప పురుటి ఖర్చు గురించి బెంగగానే ఉంది. మధ్యలో కట్నం గొడవ ఒకటి. ఈ సమస్యల మహాసంద్రం ఈది అవతలి గట్టుకి తను చేరి తన వాళ్ళని చేర్చడం ఎలాగో తెలీక మథనపడసాగాడతడు.

ఇక ఆదెమ్మకి పట్ట పగలే కారు చీకట్లు కమ్మినట్టుగా ఉంది. అన్నగారి ఆర్థిక పరిస్థితి తెలుసు. భర్త పడుతోన్న పాట్లూ, అత్తగారి ఆవేదనా కూడా తెలుసు. అందుకే దిక్కు తోచని పక్షిలా, రెక్క విరిగిన పక్షిలా అలమటిస్తోంది.

తొమ్మిది నెలలూ నిండాయి ఆదెమ్మకి. చాలా భారంగా నీరసంగా ఉందామె. ఆమె పరిస్థితి చూసి తొలి కాన్పు గనుక ఆసుపత్రిలో జేర్చడమే మంచిదని అమ్మలక్కలు సలహా ఇచ్చారు. భార్య కూడా అదే మాటనడంతో ఆదెమ్మను పాతిక మైళ్ళదూరంలో ఉన్న ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళక తప్పలేదు.

బస్సులోనే నొప్పులు మొదలయ్యాయి ఆదెమ్మకి. కళ్ళనుండి కన్నీరు ధారలు కడుతుంటే, బాధతో చెల్లెలు మెలికలు తిరిగిపోతుంటే చిన్న పిల్లాడిలా విలపించాడు, మరి కొంచెం ముందు తీసుకురానందుకిదవుతూ.

ఆసుపత్రిలో జేర్చిన అరగంటకే మగ బిడ్డను ప్రసవించింది ఆదెమ్మ. తల్లీ బిడ్డా క్షేమంగా ఉండటంతో తృప్తిగా నిట్టూర్చాడతడు.

తను కూడా ఆ ఊళ్ళో ఉంటే బోలెడు ఖర్చనీ, తల్లీ బిడ్డలక్కావలసిన పాలూ నీళ్ళూ ఆసుపత్రి వారే చూస్తారు గనుక అయిదో రోజున తీసుకెళ్ళడానికొస్తానని ధైర్యం చెప్పి కాస్త చూస్తుండమని చుట్టుపక్కలి వాళ్ళకి చెప్పి వెళ్ళిపోయాడా మర్నాడు.

తనకి మగబిడ్డకలగటంతో వెర్రి ఆనందంతో తన అత్తగారికీ, సెనిమిటికీ చెప్పమని అత్తవారి ఊరి వాళ్ళో ఇద్దరికి చెప్పింది ఆదెమ్మ. ఆ ఉత్తర క్షణాన్నుంచే భర్త అడుగుల చప్పుడుకోసం చెవులు రిక్కించి ఎదురుచూడసాగిందామె.

బాబు ఎందుకో ఏడ్వసాగాడు.

ఆలోచనల నుండి ఉలిక్కిపడి తేరుకుని బిడ్డని గుండెల కదుముకుని రొమ్ము నందిచ్చింది. తల్లి గుండెలో ఒదిగిపోతూ పాలు త్రాగుతూనే హాయిగా, నిశ్చింతగా, వెచ్చగా పడుకున్నాడు వాడు.

ఎర్రటి వాడి ఒళ్ళునీ, తలనీ నిమిరి జోకొడుతూ 'నా బాబే-నా తండ్రే' అని మురిసిపోయిందామె. పాలిస్తున్నందున వీలు పళ్ళేదుగానీ, లేకపోతే వాడిని ముద్దుల్తో ముంచెత్తేదే.

తనకి పురుడొచ్చిన రాత్రే మరి అయిదుగురికి పురుడొచ్చింది. చిత్రమేమిటంటే తనకి తప్ప మిగతా వాళ్ళందరికీ ఆడపిల్లలు పుట్టారు. అంతా తననెంత గొప్పగా, అభినందనగా చూశారో గుర్తొచ్చే సరికి సంతోషంతో పరవశించి పోయింది.

'ఎన్ని పుణ్యాలు చేశానో! ఈ కొండ నా కడుపున పుట్టాడు' అని మురిసిపోయింది ప్రేమగా బాబుని నిమురుతూ ఆదెమ్మ.

వీడి తండ్రి ప్రొద్దున్న వీడ్ని చూసి ఎంతగా పొంగిపోయారో!

భర్త గుర్తొచ్చే సరికామె ముఖంలో రంగులు మారిపోయాయి. ఉత్సాహం ఇగిరిపోయింది.

తనెంతగానో ఎదురు చూస్తోన్న భర్త అవాళ ప్రొద్దుట వచ్చాడు. పక్క మంచాల దగ్గరికి వస్తోన్న మగాళ్ళనీ, వారి చేష్టల్నీ చూసి ఆయనొస్తే తానేం చెయ్యాలో-బాబు నెలా చూపాలో వూహించుకుని తనలోనే ఎన్నెన్నో రిహార్సిల్స్ వేసుకున్న ఆదెమ్మ, తీరా అతడొచ్చేసరికి కంగారు పడిపోయింది. కనురెప్పలు సిగ్గు బరువుచే వాలిపోతూంటే విజయ గర్వంతో కూడిన చిరు దరహాసం పెదాల మీద తారట్లాడుతోంటే, బుగ్గలు గులాబీల నిగ్గులు సంతరించుకొంటోంటే బాబు నందిచ్చింది.

అతడు వాణ్ణి చూసి ఎంతో సంబర పడ్డాడు. ముద్దులాడాడు. నీ పోలికే అంటూ మెచ్చుకున్నాడు. ఆమె ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నాడు. ఆమె తీయని ఊహల ఊయల్లో తనువు మరిచి వూగుతోంటే ఒక నాటు బాంబు ఆమె మీదికి విసిరేసి వెళ్ళిపోయాడు నిర్దాక్షిణ్యంగా.

ఆమె అన్నగారు కట్నం సొమ్ము ఇవ్వకపోతే తనకి వేరే పెళ్ళి చేయాలన్న పట్టుదల మీద ఉందట అతడి తల్లి! ఎలాగైనా మీ అన్నతో పోరి ఆ డబ్బు ఇప్పించెయ్. లేకపోతే ఆవిడ తన పంతం నెరవేర్చుకుంటుందని చెప్పాడు.

అదిగో అప్పట్నుంచీ ఘనీభవించిన విషాదంలా ఉండిపోయి గజిబిజి ఆలోచనల్తో, ఎర్రగా రగుల్తోన్న భయాల్తో కత్తుల శయ్యమీద పవ్వళించినట్లుగా ఉండిపోయిన ఆదెమ్మ దరిజేరడానికి నిద్ర భయపడి పలాయనం చిత్తగించింది నేస్తం మనశ్శాంతితో కలిసి.

రేపే ఆస్పత్రినుంచి పంపించేస్తారు. అన్నయ్య వచ్చి తీసుకెళ్తాడు. నెలలో గాకపోయినా మూడో నెలలో తప్పకుండా తనని అత్తవారింటికి పంపిస్తాడు. అన్నయ్యెలాగూ ఆ డబ్బు తేలేడు గనుక తామెళ్ళేసరికి అత్తింట పెళ్ళి భాజాలు మోగుతూంటాయేమో! అప్పుడు తన గతేమిటి? తన బిడ్డ భవిష్యత్తేమిటి?

భోరున ఏడ్వసాగింది ఆదెమ్మ.

ఆమె కన్నీటి వరదకి చీకటి కొట్టుకుపోయింది. కర్మసాక్షి-కేవలం పగటి విషయాలకి కేవలం సాక్షియైన సూర్యుడు రోజులానే వేళకి డ్యూటీలో జేరాడు.

మెల్లగా ఆసుపత్రికి చలనం రాసాగింది.

నైట్ డ్యూటీ నర్సు మరో నర్సుకి డ్యూటీ అప్పగించి వెళ్ళిపోయింది.

సిస్టర్ రత్నం నల్లగా ఉంటుంది. బలంగా ఉంటుంది. ముఖంలో కండ పుష్టిగా ఉంటుంది. కాస్త మోటుగా రాటుదేలి ఉంటుంది. రికార్డు ప్రకారం ఆమె వయస్సు 35. చూపుల ప్రకారం 27.

ఎప్పుడో ఆమె చదువుకునే రోజుల్లో ప్రేమించానని ఒక కుర్రాడు మోసం చేశాడు. నర్స్ ట్రైనింగ్ అవుతూంటే పెళ్ళి చేసుకుంటానని ఒక నడి వయసతను మోసం చేశారు. ఒక నర్సింగ్‌హోమ్‌లో పని చేస్తున్నప్పుడు నోటితో ఏమీ చెప్పకుండానే చెప్పి మోసం చేశాడో ముసలి డాక్టరు.

అప్పటికామెకి ఇద్దరు పిల్లలు. ఇక ప్రేమా పెళ్ళీ, నీతీ గీతా అని కూర్చుంటే లాభం లేదని ఎలాగోలా సంపాదించి ఎంతో కొంత నిలవ వేస్తే తప్ప తన పిల్లలు భవిష్యత్తుకి భద్రత ఉండదని గ్రహించి ఆ దార్లో నిర్భయంగా నడిచేస్తూంది.

ఆవిడ వార్డులో ఉన్నంతసేపూ ఆవిడ మాట తప్ప మరోటి వినిపించదు. వినిపించనివ్వదు. కసురుతూ, తిడుతూ, ముఖం చిట్లిస్తూ తీసి పారేస్తూ, హెచ్చరిస్తూ,

అలసి పోతూ హైరాన పడుతూన్నట్లు కనిపిస్తూ ఉంటుంది. అలా అని అందర్నీ ఒకే గాట కడ్తుందని అర్థం కాదు.

ఆమె దృష్టిలో పేషంట్లు మూడు రకాలు. అడగాల్సిన అవసరం లేకుండానే పై డబ్బులిచ్చేవాళ్ళు. అడగ్గా అడగ్గా గింజుకుంటూ ఇచ్చేవాళ్ళు. అడిగినా ఇవ్వలేని వాళ్లు. అందుచేత వాళ్ళతో ఆమె ప్రవర్తన కూడా అన్ని రకాలుగానూ ఉంటుంది. మొదటి వాళ్ళకి అడక్కుండానే అన్నీ సమకూరుస్తుంది. మళ్ళీ మళ్ళీ అడిగించుకుని, విసుక్కుంటూ చేస్తుంది రెండో వాళ్ళకి. అడిగితే కసిరి బుద్ధి కుదిరితే భిక్షం వేసినట్టు చేస్తుంది మూడో వారి విషయంలో. అదీ ఆమె పోలసీ.

"మీరంతా ఎందుకొచ్చారండీ? ఇది పురుళ్ళ వార్డు. మగాళ్ళింత మంది రాకూడదు. వెళ్ళండెళ్ళండి. ఒక్కొక్కళ్ళూ రండి. ఏవమ్మా! అలా కాళ్ళు ముడుస్తావేమిటి? జాపు జాపు. దార్లో పడుకున్నదెవరు? మీ తాలూకా? లేలే. దార్లో పడుకుంటే ఎలా? హలో! బాగుందమ్మా.....పాపకెలా ఉంది? గుడ్ ప్రోగ్రెస్. స్నానం చేయించేక మందు వేస్తాను. ఏవిటీ? బిడ్డ పాలు కక్కుకుంటున్నాడా? ఎప్పట్నుంచీ? అదే పనిగా పట్టించావా ఏవిటీ? పది మంది పిల్లల్ని కనా పాలు పట్టడం తెలీదు. ఏం మనుషులో.....డ్రాప్స్ వేస్తాన్లే. ఈ సామానంతా ఎవరిది? హాస్పిటల్ అనుకున్నారా క్లోక్‌రూమ్ అనుకున్నారా? తీసెయ్యండి తీసెయ్యండి"

ఒక్కొక్కర్నీ చూస్తూ, పరామర్శిస్తూ, వ్యాఖ్యానాలు చేస్తూ, ఆదెమ్మ దగ్గరికొచ్చి చార్ట్ చూసి "నువ్వా బాబూ కులాసాయే కదా? ఇవాళ డిశ్చార్జ్ చేసేస్తాం. పదింటి కల్లా వెళ్ళొచ్చు" అంటూ ముందుకెళ్ళిపోయింది రత్నం.

ఆదెమ్మ ముఖం వెలవెల బోయింది. ఇంతవరకూ అన్నగారు రాలేదు. ఎప్పుడొస్తాడో తెలీదు. ఈ లోగా పంపించేస్తే ఈ నెత్తురు గుడ్డుని తీసుకునెక్కడికెళ్ళగలదు? బస్సు చార్జీ మాట దేవుడెరుగు......ఇన్ని టీ నీళ్ళు నోట్లో పోసుకోడానికైనా చేతిలో పైసా లేదు.

ఆమె కళ్ళ నీళ్ళు చూసి బుగ్గలు నొక్కుకుంది పక్క బెడ్ మీది అమ్మాయి అత్తగారు. ఆవిడ కోడలికిదివరకు ముగ్గురు ఆడపిల్లలు. నాలుగోసారీ అమ్మాయే పుట్టిందని నిమిషానికి పదిసార్లు వాపోతోందావిడ.

"ఏం పిల్లా! నీ కడుపు చల్లగా తొలిసారే పండంటి కొడుకుని కన్నావ్. ఇంకా ఏడుస్తావు దేనికే?" అంది, ఎవరైనా ఏడిస్తే మగబిడ్డ పుట్టనందుకే తప్ప మరో దాని గురించి ఏడవకూడదన్నట్టు.

కళ్ళు తుడిచేసుకుంది కాని, కన్నీళ్ళు ఆగటం లేదు.

"మగపిల్లాడు పుట్టలేదని మేమేడుస్తూంటే మగపిల్లాడు పుట్టినా ఈ పిల్ల ఏడుస్తూంది. ఏం కాలం రా, దేవుడా! పిదప కాలం, పిదప బుద్ధులూనూ. అయినా ఆ దేవుడికి రిమ్మ తెగులుగాకపోతే మా పిల్లని ఆళ్ళకిచ్చి, ఆ బిడ్డని మా కివ్వకూడదూ?" గొణుక్కుంటూ వెళ్ళిపోయిందావిడ.

చటుక్కున ఆదెమ్మ హృదయాకాశంలో చిన్న మెరుపు మెరిసింది.

తొలి కాన్పులో మగబిడ్డ కలగటం అదృష్టమే. కానీ ఆ అదృష్టం తన కాపురాన్ని నిలబెట్టదు. ఇలాటి ఎందరో పండంటి బిడ్డలకి తను జన్మ నివ్వగలదు, తన కాపురం నిలిస్తే అప్పుడే సగం కూలిన తన గూడుని నిలపగల శక్తి అన్నయ్యకు లేదు. తల్లిని త్రోసిరాజన గల ధైర్యం ఆయనకి లేదు. ఫలితం తామిద్దరూ అనాథలుగా, ఒకరికి బరువుగా ఒకరు మిగలటం!

పుడుతూనే దురదృష్టపు విష కౌగిల్లో నలగాలి వీడు – కేవలం తన కడుపున పుట్టి నందున! అందుకని.....అందుకని......వీడ్ని అయిదొందలకి అమ్మేస్తే?

బిడ్డ పోయిందని చెప్పి అందర్నీ నమ్మించొచ్చు. డబ్బు చూసి అత్త సంతోషిస్తుంది. సుబ్బారాయుడిగారి తరతరాల అప్పు తీరినందుకాయన సంతోషిస్తారు. ఆయన సుబ్బారాయుడిగారి దగ్గర పని మానేసి మరొకరి దగ్గర ఎక్కువ జీతానికుద్దురుతారు.

తన సంసారం కళకళలాడుతుంది. కూడుకీ గుడ్డకీ లోటుండదు.

ఆఖరికి వీడిని కొనుక్కున్న వాళ్ళు వీడ్నెంతో ప్రేమగా చూసుకుంటారు. గనుక వీడి రాతా బాగుంటుంది.

ఇవన్నీ కేవలం అయిదొందల రూపాయల మీద ఆధారపడి ఉన్నాయ్. అందుచేత వీడ్ని అమ్మేస్తే?

ఉలిక్కి పడింది. భయపడింది. బిడ్డని గట్టిగా గుండెలకి హత్తుకుని బెదురు చూపులు చూసింది చుట్టూ.

ఒక వేళ బాబుని కొనుక్కున్న వాళ్ళు వీడి కన్ను పొడిచో, కాలు విరిచో అవిటివాడ్ని చేసి అడుక్కునే వాడుగా చేస్తే? అసలు వీడిని–ఈ రోజుల పసిగుడ్డుని ఈ చేతుల్తో మరొకరికెలా ఇవ్వగలదు? ఇచ్చి ఎలా భరించగలదు?

అంతలోనే భర్త మాటలు చెవుల్లో మార్మోగాయ్. ఆ వెంట మంగళ వాయిద్యాలు కర్ణకఠోరంగా వినిపించాయ్.

"మేమే బతక లేక చస్తున్నాం. ఈవిడ్నీ, ఈవిడి కొడుకునీ ఎక్కడ సాకగలం?" అంటోంది వదిన. "అన్నాళ్ళూ కాపురం చేశావుగాని, మొగుడ్ని ఆకట్టుకోలేక మానెత్తిన శనిలా దాపురించావు" అన్నయ్య విసుక్కుంటున్నాడు.

ఉహూ అలా జరక్కూడదు. తన కాపరం, తన జీవితం తన కళ్ళ ముందే కుప్ప కూలి మాడిమసై పోకూడదు.

అరచేతుల్లో ముఖం దాచుకుని ఏడవ సాగింది ఆదెమ్మ.

"ఏవమ్మా!"

చల్లని పిలుపు. తలెత్తి చూసింది.

ఎదురుగుండా ఆందోళనగా చూస్తూ సన్నగా పొడుగ్గా ఖద్దరు బట్టల్లో ఉన్న మాస్టారు.

ఆయన కూతురు రెండ్రోజుల క్రితమే ప్రసవించింది. ఆమె మంచం ఆ పక్కనే అవడంతో వచ్చినప్పుడల్లా ఆదెమ్మని పలకరిస్తుంటారు. ఆమె కథ తెలిసి మిగిలిన ఆహార పదార్థాలు పెడుతూ, ఆప్యాయంగా ధైర్యం చెబుతూంటారు.

ఆయన బతకలేక బడిపంతులై సరిగ్గా జీతాలు రానందున బతకలేక బతికి రెండేళ్ళ క్రితం రిటైరై పెన్షన్ కోసం ఆఫీసుల రెడ్‌టేపిజపు సాలెగూడులో చిక్కుకున్న తన ఫైలు అంతు తెలీక అలమటిస్తూ కాళ్ళరిగేలా తిరుగుతూన్న బడుగు జీవి!

గబగబా కళ్ళు తుడిచేసుకుంది ఆదెమ్మ.

"ఏవమ్మా! ఎందుకేడుస్తున్నావ్? బాబుకి బాగానే ఉంది కదా?" తలూపింది.

"మీ వాళ్ళెవరూ రాలేదా?"

తల అడ్డంగా వూపింది.

"ఇవాళావిణ్ణి డిశ్చార్జి చేసేస్తున్నారు, నాన్నా" మాస్టారి కూతురు అంది.

"అలాగా. బిడ్డని తీసుకుని నవ్వుతూ ఇంటి కెళ్ళక కన్నీరెందుకమ్మా! తప్పు కదూ. తుడుచుకో. మీ వాళ్ళొస్తార్లే. అన్నీ అవే సర్దుకుంటాయి. నువ్వు నిశ్చింతగా, ధైర్యంగా ఉ ండమ్మా"

తలూపింది ఆదెమ్మ.

మాస్టారు వారమ్మాయితో బాటు ఆదెమ్మకూడా కాఫీ ఇచ్చి కొంచెం సేపు కబుర్లు చెప్పి వెళ్లిపోయారు.

పదకొండు గంటలకి రత్నం వచ్చి "ఏవమ్మా! ఇంకా తీరిగ్గా పడుకున్నావ్? లెగు లెగు. అన్నీ సర్దుకో. నిన్ను డిశ్చార్జి చేసేశాం. ఇక వెళ్ళిపోవచ్చు" అని చెప్పేసింది.

అన్నగారి కోసం మరి కొంచెం సేపు చూసి నిరాశ చేసుకుని మెల్లగా తన బట్టలూ అవీ మూట కట్టింది. చెంబూ గ్లాసూ లాంటి సామాన్లని సంచిలోకి సర్దింది. బిడ్డని భుజాన వేసుకుని ఒక చేత్తో సంచీ, ఒక చేత్తో మూటా పట్టుకుని మాస్టారమ్మాయితో చూపులతోనే వెళ్ళొస్తానని చెప్పి అతి కష్టం మీద హాస్పిటల్ కాంపౌండ్ దాటి బయటి కొచ్చింది.

ఎటు పోవాలో తెలీలేదు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా ఎలా ఇంటికెళ్ళాలో అర్థం కాలేదు. తనో పక్క కెళ్ళాక అన్నాగారొస్తే ఇబ్బందనిపించి తినుబండారాలూ ఖాళీ సీసాలూ అమ్మే కొట్ల పక్కనున్న కిళ్ళీ బడ్డీ నీడలో కూలబడింది.

ఎండ ముదురుతోంది. నీడ తరుగుతోంది.

ప్రొద్దుట తాగిన కాఫీ నీళ్ళు తప్ప మరేమీ కడుపులో పడలేదేమో శోష వస్తున్నట్టుగా ఉంది. బిడ్డ పాలు కోసం మారాం చేస్తున్నాడు.

ఆదెమ్మ కేమీ పాలు పోలేదు. ఆమె కళ్ళు రోడ్డుని ఆ మూల నుంచి ఈ మూలదాకా సర్వే చేసి అలిసిపోయాయ్.

అన్నయ్య రాడేమో. తనెలా వెళ్ళడం?

చిగురుటాకులా వణికింది. కన్నీరు పొంగి వచ్చింది.

పూర్తిగా చావని ఆశతో నీరసంగా కూర్చుని అన్నకోసం ఎదురు చూడ సాగింది-ఎంచేతో ఆలస్యమై ఉంటుంది, తప్పక వస్తాడనుకుంటూ. ఆసుపత్రికి వచ్చి పోయేవాళ్ళూ, జంగిడీలవాళ్ళూ, రిక్షాల వాళ్ళూ, షోడాల వాళ్ళూ ఆమె వంక వింతగా, జాలిగా, అదోరకంగా చూస్తున్నారు. ఏదేదో చెప్పుకుంటున్నారు. మధ్య మధ్య నవ్వుకుంటున్నారు కొందరు. అదేమీ పట్టించుకోకుండా నిరీక్షిస్తోందామె.

గాలి తిరిగింది. అతడు రాలేదు.

పొద్దు వాలుతోంది. అతడు రాలేదు.

వస్తాడొస్తాడన్న ఆశ అడుగంటుతోందామెలో. ఇంకాస్సేపట్లో చీకటి పడొచ్చు. తనింకెలా ఇంటికెళ్ళగలదు? ఒంటరిగా ఈ అపరిచిత పట్టణంలో ఎలా ఉండగలదు?

బహుశా దారి ఖర్చుల కోసమూ, ఆసుపత్రివాళ్ళేమైనా డబ్బు కట్టమంటారేమోననీ డబ్బుకోసం ప్రయత్నిస్తే దొరికి ఉండదు. అందుకే అన్నయ్య రాలేదనుకుంది. కన్నీళ్ళు కట్టలు తెంచుకున్నాయ్. ఈమాత్రం దానికే తనని నట్టేట్లో వదిలేసిన అన్నయ్య రేపెప్పుడో అయిదొందలిచ్చి తన కాపురం నిలపగలడా? అసంభవం. మరేది దారి భగవంతుడా !

పొద్దుటొచ్చిన ఆలోచన మళ్ళీ వచ్చింది.

బాబుని అమ్మేస్తే ?

మాతృ హృదయం కళవళపడింది. కాని వాడు, తను బావుండాలంటే, తమ బతుకులు బాగుపడాలంటే... అంతకంటే మరో గత్యంతరం కన్పించలేదు.

బాధగా బాబు వంక చూసింది. అమాయకంగా నిద్రపోతున్నాడు. నుదుట ముద్దు పెట్టుకుంది. గుండె దిటవు చేసుకుని లేచింది. రిక్షావాళ్ళ దగ్గరికెళ్ళి సగం చచ్చి అంది "ఈ బాబునిచ్చేస్తాను ఎవరికైనా కావాలా అయ్యా!"

వాళ్ళు నమ్మనట్లుగా ఆశ్చర్యంగా పిచ్చిది కాదుకదా అన్నట్టు చూశారు. ఏ పెళ్ళి కాకుండానో తల్లైన బాపతేమో అనుకుని నవ్వుకున్నారు లోలోన.

"అమ్మేస్తావా? ఇచ్చేస్తావా?" ఒకరడిగారు.

"అ.....అమ్మేస్తాను"

'నాకు ముందే తెలుసులే' అన్నట్టు నవ్వి "అదిగో ఆ కాఫీహొటల్ ఆయనకి పిల్లల్లేర్లే. చక్కని పిల్లాడు దొరికితే పెంచుకుందామని చూస్తున్నారు. వెళ్ళడుగు" అన్నాడు.

మూటా సంచీ తీసుకుని రోడ్డు కవతలున్న హొటల్ దగ్గరకెళ్ళి బయటే నిలబడిపోయింది సందేహిస్తూ కొంచెంసేపు. ఎట్టకేలకు ధైర్యం కూడదీసుకుని గల్లాపెట్టె దగ్గర కూర్చున్నాయనని సమీపించి ఉబికి వస్తోన్న కన్నీళ్ళని నిగ్రహించుకుంటూ అంది "అయ్యా, పేదదాన్ని. ఈ పిల్లాడ్ని అమ్మేస్తానయ్యా"

అతడామె వంక ఎగాదిగా చూస్తూ పిల్లాడ్ని చూశాడు. ఎర్రగా కాస్త బక్కగానే అయినా బాగున్నాడు. ముఖంలో కళ కన్పించింది. ఆమె పుట్టు పూర్వోత్తరాలూ అత్తింటి వివరాలూ ఎందుకు అమ్మేస్తున్నదీ అన్నీ వివరంగా తెలుసుకుని అన్నాడు.

"సరే-ఒక వంద రూపాయలిస్తాను. నీకో చీర పెడతాను. ఇష్టమైతే ఇయ్యి. కానీ మళ్ళీ నువ్వెప్పుడూ మా ఇంటికి రాకూడదు. మీవాళ్ళెవరూ నా మీదికి తగవుకి రాకూడదు. అలాగైతేనే మరి"

"అయిదొందలిప్పించండయ్యా! మీ కాళ్ళట్టుకుంటాను. నా కాపరం నిలపండయ్యా!" ప్రాధేయపడింది.

"పోనీకదా అని వందరూపాయలిస్తానంటే నీలుగుతున్నావే.....వెళ్ళు వెళ్ళు"

"అయ్యా!"

"అయ్యాలేదు, కొయ్యాలేదు. నే నింకా మంచివాణ్ణి గనుక జాలిపడి వందరూపాయలిచ్చి, చీర పెడతానంటున్నాను. మరొకళ్ళయితే అయిదు నోటు కూడా ఇవ్వరు"

మరి కొంచెంసేపు నిలబడింది దీనంగా చూస్తూ.

"ఇష్టమైతే ఇవ్వు. బలవంతం ఏం లేదు"

వందరూపాయలు తన కాపురాన్నేరకంగానూ నిలపలేవనుకుంటూ దిగులుపడుతూ వెనుదిరిగి వచ్చింది.

"ఏవన్నాడాయన? కొంటానన్నాడా?" ఇందాక చెప్పినతనడిగాడు.

ఆమె నోరు తెరిచేలోగానే-"ఏవిటి కొనటం, అమ్మాయ్?" అనడిగాడు అప్పుడే అక్కడికొచ్చిన మేస్త్రారు.

ఆయన వంక చూళ్ళేక తల దించుకుని నోట్లో చీర కొంగు కుక్కుకుంది.

ఆమె పొద్దుట్నుంచీ 'సీతమ్మోర్లా' అక్కడ కూర్చునుండటం, ఇంతక్రితం బిడ్డనమ్ముతానని హొటల్ అతని దగ్గరికెళ్ళి రావడం వివరించారు వాళ్ళు.

ఆయనంతా గ్రహించారు. "మీ అన్న రాల్లేదా?"

తల అడ్డంగా వూపింది.

"చూడమ్మా! నీ అత్తవారు ఎలాటివారైనా నీ బిడ్డని చూశాక నిన్ను తప్పకుండా ఆదరిస్తారు. వారి వారి కారణాల వల్ల కట్నం ఇవ్వకపోతే వేరే పెళ్ళి చేస్తామని బెదిరించినా, అన్నంత పనీ చేస్తారనుకోవడం పొరపాటు. నీ అనుమతి లేకుండా రెండో పెళ్ళి చేసుకోవడం చట్టరీత్యా నేరం. ఒక వేళ దురదృష్టవశాత్తూ నిన్నాదరించకపోతే నువ్వు చేయాల్సింది బిడ్డని అమ్ముకోవడం కాదమ్మా. చెట్టూ చేమలూ, పశు పక్ష్యాదులు కూడా తమ బిడ్డలు తమ కాళ్ళమీద తాము నిలబడే వరకూ చేయూతనిస్తాయి. తండ్రితోబాటు తల్లి కూడా ముఖం చాటేస్తే, చేతులు దులిపేసుకుంటే ఇక ఆ బిడ్డలకి దిక్కెవ్వరు? మన తల్లులూ అలాగే చేసి ఉంటే మన మీ రోజునిలా ఉండగలిగేవాళ్ళమా? నీకు చదువులేదని అధైర్యపడకు. కాయకష్టం చేసైనా నీ బిడ్డని పెద్దచెయ్యడం నీ బాధ్యత తల్లీ ! ఇవాళ రేపు

ప్రపంచం రూపాయి బిళ్ళ అంచుమీద నడుస్తోన్న మాట నిజమే. ఆ రూపాయి బిళ్ళ క్రింద మనలాంటి అభాగ్యులు నలుగుతున్న మాటా నిజమే. కాని కాలం ఎప్పటికీ ఇలాగే ఉండిపోదమ్మా. ఆ శుభ ఘడియలు మనం చూడకపోయినా, నీ బిడ్డ చూస్తాడమ్మా. రాబోయే మంచికాలమంతా వీళ్ళదే. మనిషికీ, డబ్బుకీ మంచికీ మమతకీ కొత్త భాష్యాలు చెబుతారు వీళ్ళు. వీళ్ళకోసమైనా మనం ధైర్యంగా నిలబడాలి. పరిస్థితుల్నెదుర్కొని నిలవాలమ్మా....."

మాస్టారి మాట లామె కర్థం కాలేదు. కాని ఆయన ముఖంలో ఆమెకొక రకమైన తేజస్సు కన్పించింది. అభయ ముద్ర కన్పించింది. కొత్త శక్తి వచ్చింది. తనమీదా, బిడ్డ భవిష్యత్తు మీదా అంతులేని నమ్మకం కలిగింది. గుండెలో ఆశాదీపం దేదీప్యమానంగా వెలుగుతోంది.

"నా దగ్గర అయిదురూపాయలే ఉన్నాయమ్మా. మీ ఊరెళ్ళడానికి సరిపోతాయను కుంటాను. ప్రొద్దుట్నుంచీ ఏమైనా తిన్నావో లేదో ఏ రొట్టో తిని, కాఫీ త్రాగి వెళ్ళిరా తల్లీ! నీ ధైర్యం, నీ మంచితనం నీకూ నీ బిడ్డకీ కొండంత మేలుచేస్తాయి"

డబ్బిచ్చారాయన.

మౌనంగా అందుకుంది. కళ్ళతోనే కృతజ్ఞతలు చెప్పి మనసులోనే చేతులు జోడించి మూటా సంచీ పట్టుకుని పిల్లాడ్ని భుజాన వేసుకుని బస్టాండువైపు నడిచింది ఆదెమ్మ.

ఆమె వెళ్ళిన వైపే చూస్తూ నిలబడ్డారు మాస్టారు.

"మీరెక్కడో పిచ్చివాళ్ళా ఉన్నారండీ. ఇలా వంకలు పెట్టి అడుక్కోవటం వీళ్ళ కలవాటండీ" అని ఒక జంగిడీ అతనంటే "ఆ రోడ్డు మలుపులోనే ఆ బిడ్డని అమ్మేస్తాది. ఇలాంటి వాళ్ళని చాలా మందిని చూశాను" అని నవ్వాడో రిక్షావాడు.

మాస్టారూ నవ్వారు.

"డబ్బు మాతృత్వపు బంధాన్ని నలిపెయ్యగలదుగాని తెలిగ్గా కత్తిరించలేదు నాయనా!"

**(ఆంధ్రప్రభ వార పత్రిక 8.7.1981)**